

# పెద్దమనసు

"మావా! యీ పొద్దు దూటీకి ఎల్లం మానీకూడదూ!" అంది సీతాలు తన భర్త రాములుతో. భార్య మాటలకు క్షణకాలం నిర్ఘాంత పోయేడు డ్రైవరు రాములు.

"నాన్నా! యీ రోజు నాకు ప్రైజులు యిస్తారు. మర్చిపోయే వేంటి? నిన్నూ అమ్మనూ తప్పక తీసుకొని రమ్మనమని మా టీచరు చెప్పేరు. యివాళ మా స్కూలుకి మినిస్టరు గారు కూడ వస్తారుట! మాకు ప్రైజులు మినిస్టరు గారి చేత్త యిప్పిస్తారుట" అన్నాడు సూర్యం వుషారుగా.

రాములుకి ఒక్కగానొక్క కొడుకు సూర్యం. మంచి తెలివైనవాడు. తన స్తోమతకు మించిన దైనా రాములు తన కొడుకుని కాన్వెంటులో చదివిస్తున్నాడు. సూర్యం సెవెన్త్ క్లాసు చదువుతున్నాడు. గత నాలుగు సంవత్సరాలుగా వాడు ప్రతి యేడూ స్కూలు ఫస్టు వస్తున్నాడు. అందువల్ల వాడికి మెరిట్ స్కాలర్‌షిప్ యిచ్చేరు. అంతేకాకుండా పుస్తకాలకు యూనిఫాంకి ప్రతియేడూ డబ్బు యిస్తున్నారు.

బాలల దినోత్సవ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వమువారు యీ యేడు యింటర్ స్కూలు వ్యాస రచన, వక్తృత్వపు పోటీలు నిర్వహించేరు. సూర్యానికి ఆ రెండింటిలోనూ ప్రథమ బహుమతులు వచ్చేయి. ఆ బహుమతి ప్రదానం యీ రోజు మంత్రిగారు వాళ్ళ స్కూల్లో చేస్తారు.

రాములు తన కొడుకు సూర్యంపైన ఎన్నో



23-2-96 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

ఆశలు పెట్టుకున్నాడు. వాడికి పెద్ద చదువులు చెప్పించి వృద్ధిలోకి తేవాలని అతని కోరిక. తాను చిన్నప్పుడు చదువుకోనందుకు ఎంతో విచారిస్తుంటాడు. కొడుకు చదువు కోసం ప్రతి నెల తనకొచ్చే బోనసు డబ్బు వాడి పేర పోస్టాఫీసులో వేస్తున్నాడు తన జీతం డైలీ బేటా యింటి ఖర్చులకు వాడుతున్నాడు.

"మధ్యాహ్నం స్పేరు డ్రైవర్ని కుదిర్చి ఓనర్ని పెర్మిషన్ అడిగి యింటికొచ్చెయ్యాలి" అనుకున్నాడు.

రాములు షెడ్డు దగ్గరకు వెళ్ళేసరికి వోనరు ఎవర్నో బూతులు తిడుతున్నాడు. రాములు వోనరుకి నమస్కరించి ప్రక్కగా నిల్చున్నాడు.

"సూద్రావులూ! ఆ నరసయ్య గోడికి కుసింతేనా యినవాన వుందీ?' యీయాల వూర్ల మినిట్టరు గోరు దిగతన్నారా! నోదు జాత్తీ గుంటాదా! టయాంల నాగా ఎట్టేసినాడు"

"యీ యాల మండీ మువ్వు పదారో నెంబరు రూట్ల ఎల్లు. ఆడి రోగం అను గుద్ది. నీ రూట్ల యింకోడిని ఎక్కిత్తా. పదారో నెంబరు రూట్ల ఎయ్యమని బతిమిలాడితె పిల్ల లోడని జాలొడితే వోరానికి మూదు నాగాలెడతన్నాడు

"మూదు దార్ల ఎక్కడా వోడొగ్గేకు. వుసారుగ దోలాల!" అన్నాడు వోనరు.

"ఏటలా సూస్తన్నావు? టయాం నేదు. బేగెల్లి బండిదియ్!" అంటూ కసురుకున్నాడు.

రాములు వుల్లిపడి గబగబా బండి వద్దకు పరిగెత్తేడు.

గజలక్ష్మి ట్రాన్స్‌పోర్టు కంపెనీ కనకయ్యకు ఆ వూర్లో అన్ని రూట్లలోనూ సిటీ బస్సులున్నాయి. స్టాఫ్‌కి రోజు వారీ కలెక్షన్ల బట్టే నెలకు వందో ఏభయ్యో బోనసు పేర ముట్టచెప్పి తను వేలకు వేలు లాభాలు ఆర్జిస్తున్నాడు.

సీతాలు ఆ రోజు మధ్యాహ్నం నుండీ భర్త రాక కోసం ఎదురు చూస్తోంది. సాయంత్రం నాలుగు గంటలైంది రాములు రాలేదు. సూర్యం మూడు గంటలకే రడీయై తల్లిని వేధిస్తున్నాడు. త్వరగా బయలుదేరమని లేకుంటే టీచరు దెబ్బలాడతారని.

భర్త రాక కోసం యింక వేచి వుండడంవల్ల ప్రయోజనం లేదనుకొని తనకున్న వాటిలో మంచి చీర కట్టుకుని తయారై యింటికి తాళం వేసి తాళం చెవులను పక్కింటికిచ్చింది. తన భర్త వస్తే యిమ్మని చెప్పి కొడుకుని తీసుకుని వాడి స్కూలుకి బయల్దేరింది.

స్కూలు మైదానం జనంతో కిటకిటలాడుతోంది. సూర్యం తన తల్లిని వాళ్ళ టీచరుకి పరిచయం చేసేడు. టీచరు వాళ్ళను ప్రధానోపాధ్యాయులకు పరిచయం చేసి ముందు వరుస కుర్చీల్లో కూర్చోపెట్టింది. సీతాలు అక్కడ కూర్చోడానికి ఎంతో మొహమాట పడి వెనుక వరుసలలో కూర్చుంటాము అంది. కాని టీచరు అంగీకరించలేదు.

సూర్యం ఫాదరు సభకు రానందున సూర్యం తల్లిని స్టేజి పైకి రమ్మని పిల్చేరు. సీతాలు భయపడి కుర్చీకి అతుక్కుపోయినట్లు కూర్చుంది. సూర్యం తల్లి చెయ్యి పట్టుకుని బలవంతంగా స్టేజి మీదకు తీసుకొని వెళ్ళేడు.

మంత్రిగారి సతీమణి, సీతాలుకి పూల గుచ్ఛాన్ని ఏపిల్ పండు యిచ్చి సత్కరించారు.

సీతాలు వాటిని అందుకొని నమస్కరించి వెనుతిరిగింది.

"ఆగు! ఏటలా ఎల్లిపోతన్నావు? నాను గురుతు నేనేటి సీతాలూ!" అన్నారు మంత్రిగారి సతీమణి.

సీతాలు కాస్త వులిక్కిపడి ఆగి వారిని అప్పుడే గుర్తుపట్టినట్లు ఆశ్చర్యంగా ముఖం పెట్టి "...తమరు వారలచ్మిగోరు!" అంది.

మంత్రిగారి సతీమణి వరలక్ష్మిగారు, సీతాలు, చిన్ననాటి స్నేహితులు మంత్రిగారు వాళ్ళ వూరు ప్రెసిడెంటుగారి బావమరిది.

"మా యజమాని గోర్ని పోల్తి పట్టినావూ?" అని సీతాలుతో అన్నారు. సీతాలు వారికి వినయంగా నమస్కరించింది.

"మన వూర్ల అమ్మినాయుడి బొట్టి సీతాలు. నా నేస్తురోలు. ఆల్ల మావనే మనువాడింది. సూడు ఎట్టాంటి సురుకైనోడిని కన్దో! ఆ బుడతడి సేతల ఏదేనా ఎట్టు నేపోతే బాగోదు" అన్నారు ఎంతో పెద్ద మనసుతో మంత్రిగారి సతీమణి, భర్తతో. పెద్ద మనసుతో ఓమారు జేబులు తడుముకొని తాను పర్సు తీసుకొని బయట కెళ్ళడూ రాని సంగతి జ్ఞాపకం చేసుకొని, వెంటనే తేరుకొని సూర్యం తెలివి తేటలకు గుర్తింపుగా వానికి వెయ్యి నూట పదహార్లు బహుమానం సభలో ప్రకటించేరు.

సీతాలు కొడుకు చెవిలో ఏమో చెప్పింది. సూర్యం ఆ విషయం ప్రధానోపాధ్యాయులకు చెప్పేడు.

ప్రధానోపాధ్యాయులు మైకు ముందుకు వచ్చి "మా స్కూల్లో పేద విద్యార్థుల సహాయ నిధి వున్నట్లు మీకు తెల్సు కదా! మంత్రిగారు తనకు బహుమతిగా ప్రకటించిన సొమ్ము వెయ్యి నూట పదహార్లూ పేద విద్యార్థుల సహాయ నిధికి విరాళంగా తీసుకోమని సూర్యం చెప్పేడు. ఈ చిన్నారి పెద్ద మనసుతో ప్రకటించిన విరాళానికి మేమిని అభినందిస్తున్నాము" అన్నారు.

ప్రేక్షకుల కరతాళ ధ్వనులు మిన్ను ముట్టేయి.

మంత్రిగారు పెద్ద మనసుతో చేసిన ప్రకటన మాత్రం ఆఖరికి ప్రకటనగానే మిగిలిపోయింది.

—రావి ఎస్. అవధాని

## ఒకే ఒక్క సినిమాను నమ్ముకున్న శిల్పాశెట్టి



ఆగ్, హత్‌కడీ, ఆవాన్ ప్యార్ కరీ వగైరా సినిమాల్లో 'మసాలా' పాత్రలు పోషించిన శిల్పాశెట్టి భవిష్యత్ డోలాయమానంలో పడింది. గోవిందా సరసన తాను హీరోయిన్‌గా నటించిన 'గాంబ్లర్' సినిమా హిట్ సింబల్ కాగలదని ఆశిస్తున్న శిల్పాశెట్టి చేతిలో మరే సూపర్. డూపర్ సినిమా లేదామె!

— సత్యశ్రీ